దువా కరేంగే.. జీతాయేంగే



సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ శుక్రవారం చిలకలగూడలోని పలు మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఆయన ముస్లిం సోదరులను కలిసి తనకు ఓట్లు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు పద్మారావు గెలుపునకు దువా (ప్రత్యేక ప్రార్థనలు) చేశారు. –చిలకలగూడ

భాయ్‌సాబ్.. మదత్ కర్నా ఆప్



సనత్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి కోట నీలిమ శుక్రవారం బేగంపేట, సనత్‌నగర్ జాఫ్రీ మసీదు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ముస్లిం సోదరులను కలిసిన ఆమె తనకు ఓటేయాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు ఆమెకు మద్దతు తెలిపారు. –సనత్‌నగర్

మినిస్టర్ సాబ్.. హమ్‌హై సాత్



సనత్‌నగర్‌లోని జామా మసీదు జాఫ్రీ ప్రాంతంలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రచారం నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఆయన ముస్లిం సోదరులను కలిసి తనకు మద్దతు తెలపాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు ముస్లిం సోదరులు, మౌలానాలు మంత్రిని సన్మానించి మీ వెంటే ఉంటామని హామీ ఇచ్చారు. –సనత్‌నగర్

అభివృద్ధి చేశా..ఓటుతో ఆశీర్వదించండి

బీఆర్ఎస్ అభ్యర్థి తలసాని శ్రీనివాస్ యాదవ్



తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు

బన్సీలాల్‌పేట్: నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధి చేశాను..ఓటు ఆశీర్వదించాలని సనత్‌నగర్ బీఆర్ఎస్ అభ్యర్థి తలసాని శ్రీనివాస్ యాదవ్ కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని రైల్ కళారంగ్, సెంట్రల్ వ్యూ అపార్టుమెంట్, బోయిగూడ, సున్నంబట్టీ తదితర ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బోయిగూడలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ రోడ్లు, డ్రైనేజీ, మంచినీరు, పార్కు ఆధునికీకరణ వంటి అనేక కార్యక్రమాలను చేపట్టామన్నారు. బోయిగూడలో ప్రజల సౌకర్యార్థం తన సొంత నిధులతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశానని గుర్తు చేశారు. మీ ఆశీస్సులతో అత్యధిక మెజారిటీతో ఎన్నికల విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఏనాడు మీ సాధక బాధలు పట్టించుకోని కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఓట్ల కోసం వస్తున్నారని ప్రజలు కష్టాలు, కన్నీళ్లలో భాగంగా పంచుకొని అందుబాటులో ఉండే వారికి మాత్రమే ఓటు అడిగే హక్కు ఉందన్నారు. ప్రచారంలో కార్పొరేటర్ కె. హేమలత, పవన్‌కుమార్ గౌడ్, సునీల్, రాజు పాల్గొన్నారు.



శ్యామలకుంట వాసులకు మంచి రోజులు..

అమీర్‌పేట: శ్యామలకుంట వాసులకు త్వరలో మంచి రోజులు రానున్నాయని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు.గురువారం రాత్రి ఆదిత్యనగర్,రవీంద్రనగర్, బాలయ్యనగర్, శ్యామల కుంటలో ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్యామలకుంటలో నిరుపేదలు ఎన్నో సంవత్సరాలుగా ఇళ్లు నిర్మించుకుని నివాసముంటున్నారని స్థల వివాదంలో ఉన్నందున పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వలేకపోయామని, త్వరలో సమస్య పరిష్కరిస్తామన్నారు. నిరంతరం ప్రజల మధ్యనే ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మిబాల్‌రెడ్డి, పార్టీ అధ్యక్షులు బాల్‌రెడ్డి, బోగి బాల్‌రాజ్, సుధీర్, విజయ్‌సింగ్, షాబాద్ శ్రీనివాస్‌రావు,ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

యువత రాజకీయంగా ఎదగాలి

పద్మారావునగర్: యువత రాజకీయంగా ఎదుగుతూ సమాజానికి తమవంతు బాధ్యతగా సేవలు అందించాలని బీఆర్ఎస్ అభ్యర్థి తలసాని శ్రీనివాస్ యాదవ్ సూచించారు. మోండా మార్కెట్ డివిజన్ ఆదయ్య నగర్ ప్లేగ్రౌండ్స్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన యువత ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు యువత యువతీ, యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎంతో మెరుగుపడ్డాయని చెప్పారు. యువత ఆత్మవిశ్వాసంతో ఉన్నత లక్ష్యాల దిశగా ముందుకు సాగాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను పెంపొందించుకొని ఆర్థిక పురోభివృద్ధి దిశగా ముందుకు సాగాలన్నారు. యువత అన్ని విధాలా అభివృద్ధి చెందినప్పుడే దేశంలో ప్రగతి పథంలో ప్రయాణిస్తుందన్నారు. రాజ్యాంగం కల్పించిన ఓటును సద్వినియోగం చేసుకోవాలన్నారు. మంత్రి కేటీఆర్ కృషితో రాష్ట్రంలో ఐటీ రంగం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ పార్టీని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

దొరల పాలనను అంతమొందించాలి



రసూల్‌పురా: తెలంగాణలో దొరల అరాచక పాలనకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి ప్రజలు తీర్పు ఇచ్చే సమయం ఆసన్నమైందని కాంగ్రెస్ మహిళా నేత విజయశాంతి అన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ వెన్నెలకు మద్దతుగా శుక్రవారం ఆమె తిరుమలగిరి, లాల్‌బజార్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు, తమిళంలో మాట్లాడి ప్రజలను ఉత్తేజపరిచారు. పదేళ్ల పాలనలో ఎలాంటి అభివృద్ధి లేదని డబుల్ బెడ్రూమ్ పథకం, ప్రాజెక్టుల నిర్మాణంలో అవినీతికి పాల్పడ్డారని లిక్కర్ స్కామ్‌లో కవితను తప్ప అందరిని అరెస్టు చేశారన్నారు. కాంగ్రెస్‌కు ఓటేసి కేసీఆర్‌కు గుణపాఠం చెప్పాలన్నారు. అవినీతి కేసీఆర్‌పై చర్యలు తీసుకోకుండా బీజేపీ కాపాడుతోందని, బీఆర్ఎస్, బీజేపీ ఒకటేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామ్‌కుమార్, గజ్వేల్ భరత్, నాసర్ హుస్సేన్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఫామ్‌హౌస్‌కు పరిమితమైన కేసీఆర్‌ను గద్దె దించాలి

అడ్డగుట్ట: నాలుగున్నర లక్షల జీతం తీసుకుంటూ ఫామ్‌హౌస్‌కు పరిమితమైన కేసీఆర్‌ను రానున్న ఎన్నికల్లో గద్దె దించాలని సినీనటి, కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపెయినర్ విజయశాంతి అన్నారు. సికింద్రాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి ఆదం సంతోష్‌కు మద్దతుగా శుక్రవారం సాయంత్రం తుకారాంగేట్ రియో పాయింట్ హోటల్ వద్ద నిర్వహించిన రోడ్‌షోలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రెండుసార్లు తెలంగాణ సెంటిమెంట్‌తో సీఎం అయిన కేసీఆర్ మూడో సారి కూడా అవకాశం కోరడం హాస్యాస్పదమన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నమైన రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియాగాంధీ నాయకత్వాన్ని బలపరుస్తూ కాంగ్రెస్‌ను గెలిపించాలని ఆమె కోరారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు బడుగుబలహీన వర్గాల ప్రజల అభివృద్ధికి ఎంతో దోహదపడుతాయన్నారు.సంతోష్‌కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని కోరారు. ఈ రోడ్‌షోలో మాజీ కార్పొరేటర్లు ఆదం ఉమాదేవి, ఆదం విజయ్‌కుమార్, సృజన్, గంటరాజుసాగర్, కృష్ణ పాల్గొన్నారు.

సీబీఎన్ నగర్‌లో శ్రీ గణేష్ ప్రచారం



రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గం రెండవ వార్డు సీబీఎన్ నగర్, కట్టమైసమ్మ బస్తీలో బోర్డు మాజీ ఉపాధ్యక్షులు సదా కేశవరెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ అభ్యర్థి శ్రీ గణేష్ శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదవిలో లేకుండానే సొంత నిధులతో రెండవ వార్డులో నాలా రిటర్నింగ్ వాల్, భూగర్భ డ్రైనేజీ పైపులైను పనులు పూర్తి చేశానని చెప్పారు. కంటోన్మెంట్ ప్రజలు ఆశీర్వదించి బీజేపీకి ఓటేసి తనను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మణికంఠ, జబ్బార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి మాటున అవినీతి

బీజేపీ అభ్యర్థి మర్రి శశిధర్‌రెడ్డి



మర్రి శశిధర్‌రెడ్డికి తిలకం దిద్దుతున్న మహిళ

సనత్‌నగర్: బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి మాటున అంతకన్న ఎక్కువగా అవినీతి జరిగిందని బీజేపీ అభ్యర్థి మర్రి శశిధర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మధ్యప్రదేశ్ విద్యాశాఖ మంత్రి మోహన్ యాదవ్‌తో కలిసి శుక్రవారం ఆయన రాంగోపాల్‌పేట డివిజన్‌లోని నల్లగుట్ట, గైదిన్‌బాగ్, సీ–లైన్, ఎఫ్–లైన్, చుట్టలబస్తీ తదితర ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మర్రి శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ పాదయాత్రలో బస్తీల ప్రజలు సమస్యలను విన్నవించుకుంటున్నారన్నారు. అంతగా అభివృద్ధి జరిగి ఉంటే ప్రజలు తమ సమస్యలను ఎందుకు తన దృష్టికి తీసుకువస్తారని ప్రశ్నించారు. నల్లగుట్ట మార్కెట్‌ను కొత్తగా నిర్మిస్తామని ఐదేళ్ల క్రితం శిలాఫలకం వేశారని, ఇప్పటికీ ఆ శిలాఫలకం వెక్కిరిస్తుందన్నారు. కళాసీగూడ నాలా ఆధునీకీకరణ గాలికి వదిలేశారని, నాలాలో పూడికతీత పైపైన చేపట్టి కమీషన్లు దండుకోవడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు.అభివృద్ధి పనుల్లో పక్షపాతం చూపిస్తున్న బీఆర్ఎస్ పాలకులను



ఇంటికి సాగనంపి సమ సమాజ నిర్మాణం కోసం నిబద్ధతో పనిచేసే బీజేపీకి ఓటేయాలని కోరారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఎటువంటి అవినీతికి ఆస్కారం లేకుండా అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఏదైనా అభివృద్ధి పనులు చేపట్టామంటే భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని శాశ్వతంగా పరిష్కారం జరిగేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేశామన్నారు. మోహన్‌యాదవ్ మాట్లాడుతూ.. దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్న మర్రి శశిధర్‌రెడ్డి లాంటి మచ్చలేని నాయకుడు తమకు అవసరమని ప్రజలు కోరుతున్నారన్నారు. అలాగే మంత్రి కుటుంబ సభ్యుల బలవంతపు వసూళ్లు, అక్రమాలను ప్రోత్సహిస్తూ చేస్తున్న వాటి నుంచి తమకు విముక్తి కావాలని ప్రజలు కోరుతున్నారన్నారు. కార్పొరేటర్ చీర సుచిత్ర, నాయకులు చీర శ్రీకాంత్, ఆకుల ప్రతాప్, దయానంద్, అఫ్జల్, సుమన్, ఆనంద్, నరేష్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్, ఎంఐఎంకు ఓటేస్తే బీజేపీకి వేసినట్టే

కాంగ్రెస్ అభ్యర్థి కోట నీలిమ



అల్లావుద్దీన్ కోఠిలో జరిగిన ప్రచార సభలో పాల్గొన్న కాంగ్రెస్ అభ్యర్థి కోట నీలిమ, అతిథులు

సనత్‌నగర్: మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి పని చేసే కాంగ్రెస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ నేతలు విజ్ఞప్తి చేశారు. సనత్‌నగర్ అభ్యర్థి కోట నీలిమకు మద్దతుగా సనత్‌నగర్ అల్లావుద్దీన్ కోఠిలో జరిగిన ఎన్నికల ప్రచార సభకు మహారాష్ట్ర మాజీ మంత్రి బాబాసిద్ధికి, కర్ణాటక ఎంపీ సయ్యద్ నసీర్ హుస్సేన్, బిహార్ ఎమ్మెల్యే షకీల్ అహ్మద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో వక్ఫ్ భూములకు రక్షణ లేకుండా పోయిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆ భూములను కాపాడుతామన్నారు. మైనార్టీలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. మైనార్టీల కోసం అనేక పథకాలను తెచ్చింది కూడా కాంగ్రెస్ మాత్రమేనని తెలిపారు. బీఆర్ఎస్, ఎంఐఎంకు ఓటేస్తే బీజేపీకి ఓటు వేసినట్లే అన్నారు. కోట నీలిమ మాట్లాడుతూ.. పదేళ్ల పాటు అధికారం ఇచ్చిన పార్టీ ఏమి చేయలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తోందన్నారు.

ఓటమి భయంతోనే దాడులు..

ఓటమి భయంతోనే తమపై బీఆర్ఎస్ కార్యకర్తలు దాడులకు పాల్పడుతున్నారని కోట నీలిమ ఆరోపించారు. బేగంపేట మసీదు, సనత్‌నగర్ జాఫ్రీ మసీదు ప్రాంతాల్లో శుక్రవారం ఆమె ప్రచారం నిర్వహించారు. అయితే జాఫ్రీ మసీదు సమీపంలో తమ ప్రచారాన్ని బీఆర్ఎస్ నేతలు అడ్డుకొని దాడులకు దిగారన్నారు. బేగంపేట మసీదు వద్ద కొంతమంది బీఆర్ఎస్ గూండాలు తమ కార్యకర్తలపై దాడులకు పాల్పడిన దారుణమన్నారు. బేగంపేటలో తమపై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఎవరికీ భయపడొద్దని కార్యకర్తలకు సూచించారు. ప్రేమ, అనురాగంతో అందరి హృదయాలను గెలుచుకుని ఎన్నికల్లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

యాంటీ బయోటిక్స్ మోతాదు మించితే ప్రమాదం

గాంధీఆస్పత్రి : యాంటీ బయోటిక్స్ మందులు మోతాదుకు మించి వినియోగిస్తే మానవ మనుగడకు ప్రమాదం వాటిల్లే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వైద్య నిపుణులు స్పష్టం చేశారు. హాస్పిటల్ ఇన్ఫెక్షన్ కంట్రోల్ కమిటీ (హెచ్ఐసీసీ) ఆధ్వర్యంలో శుక్రవారం గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో ప్రపంచ యాంటీ మైక్రోబయోల్ రెసిస్టెన్స్ అవగాహన కార్యక్రమాలు, చైతన్యర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న డీఎంఈ రమేష్‌రెడ్డి, సూపరింటెండెంట్ రాజారావు, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ మాట్లాడుతూ.. యాంటీ బయోటిక్స్‌ను అధికంగా వినియోగించడంతో మానవ శరీరం డ్రగ్ రెసిస్టెన్స్‌కు అలవాటు పడి కొన్నాళ్ల తర్వాత పని చేయదని, రోగ నిరోధకశక్తి తగ్గిపోవడం, యాంటీ బయోటిక్స్ పనిచేయక ప్రపంచవ్యాప్తంగా మానవాళి మనుగడ కష్టంగా మారుతుందని వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్‌తో పాటు పలు ఆరోగ్య సంస్థలు హెచ్చరించినట్లు వివరించారు. ఆర్ఎంపీలు, మెడికల్ షాపులు ఇచ్చే యాంటీ బయోటిక్స్ ఎక్కువగా వాడొద్దని, గుర్తింపు పొందిన వైద్యుల సలహా మేరకే వినియోగించాలని సూచించారు. ఆర్ఎంఓ–1 జయకృష్ణ, మైక్రోబయోలజీ హెచ్ఓడీ జ్యోతిలక్ష్మీ, ఇన్ఫెక్షన్ కంట్రోల్ ఆఫీసర్ అర్చన, ఎల్ఆర్ఎంఓ పద్మ, నర్సులు సునీత, జెస్సీమోల్ పాల్గొన్నారు.

సూపర్ మార్కెట్‌లో చోరీ

ఇద్దరి రిమాండ్



సోహన్ సింగ్, శ్రవణ్ సింగ్

లాలాపేట: ఓ సూపర్ మార్కెట్‌లో చోరీకి పాల్పడిన ఇద్దరిని రిమాండ్‌కు తరలించిన ఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. తార్నాక సెయింట్ ఆన్స్ స్కూల్ పక్కన వీధిలో బండారి దినేష్‌కుమార్ అనే వ్యక్తి దీపక్ సూపర్ మార్కెట్‌ను నిర్వహిస్తున్నారు. ఈ నెల 21న రాజస్థాన్‌కు చెందిన సోహన్ సింగ్ (23), శ్రవణ్ సింగ్(19) సూపర్‌మార్కెట్ షట్టర్ తాళాలు పగలగొట్టి అందులోని కొంత నగదుతో పాటు వస్తువులను దోచుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన ఓయూ పోలీసులు సీసీటీవీ ఫుటేజి ఆధారంగా సోహన్ సింగ్, శ్రవణ్ సింగ్‌ను అరెస్టు రూ 1,18,000 నగదు, ఓ ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

నేడు యూపీ సీఎం రాక

సనత్‌నగర్: సనత్‌నగర్ బీజేపీ అభ్యర్థి మర్రి శశిధర్‌రెడ్డికి మద్దతుగా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సనత్‌నగర్ నియోజకవర్గంలో శనివారం రోడ్ షో నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు రోడ్ షో కొనసాగనుంది. ఆర్పీరోడ్డు నుంచి రోడ్ షో మొదలై ఎంజీ రోడ్డులో ముగిస్తుందని బీజేపీ శ్రేణులు తెలిపారు. మహంకాళి పోలీస్‌స్టేషన్ సమీపంలో యోగి ఆదిత్యానాథ్ మాట్లాడతారని పేర్కొన్నారు.

లాస్యకు టీఎమ్మార్పీఎస్ మద్దతు

కంటోన్మెంట్: కంటోన్మెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి లాస్య నందితకు టీఎమ్మార్పీఎస్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని అధ్యక్షుడు ఇటుక రాజు మాదిగ ప్రకటించారు. కార్ఖానాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తున్న బీఆర్ఎస్ పార్టీకి మద్దతు ఇస్తున్నామన్నారు. ఎస్సీ వర్గీకరణ పేరుతో కాలయాపన చేస్తున్న మోదీ సర్కారుకు మంద కృష్ణ మాదిగ మద్దతు ఇవ్వడంపై ఇటుక రాజు మండిపడ్డారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, మంద కృష్ణ కుమ్మక్కై దళితులకు తీరని ద్రోహం చేస్తున్నారని దుయ్యబట్టారు. పెద్దరాజు, శివకుమార్, తరుణ్, ఇటుక గోపి, రామారావు, జాన్సన్, ధీరజ్, గిరి, వెంకట్, శ్రీనివాస్, జాన్, శివకుమార్, నాగేశ్, వినోద్ పాల్గొన్నారు.

- కంటోన్మెంట్ విలీనానికి సహకరిస్తున్న బీఆర్ఎస్ పార్టీకే తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని కంటోన్మెంట్ వికాస్ మంచ్ ప్రకటించింది. మంచ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గడ్డం ఏబెల్, సంకి రవీంధర్ ఆధ్వర్యంలో లాస్య నందితను కలిసి మద్దతు తెలిపారు.

ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కృషి

బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు



మద్దతు ప్రకటిస్తున్న ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు

చిలకలగూడ: ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని, వారి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందని సికింద్రాబాద్ అభ్యర్థి తీగుళ్ల పద్మారావు అన్నారు. చిలకలగూడలోని బడే మసీదు, చోటీ మసీదు, ఏక్‌మినార్ తదితర మసీదులను శుక్రవారం ఆయన సందర్శించి ముస్లిం మైనార్టీ నేతలు, మత పెద్దలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మైనార్టీ యువతకు విద్యావకాశాలు కల్పించేందుకు ప్రత్యేక సంస్థలను స్థాపించామని, మోజం, ఇమామ్‌ల గౌరవ వేతనం పెంచామని గుర్తు చేశారు. సికింద్రాబాద్‌లో మసీదులు, ఈద్గా, ఛిల్లాలను మరింత ఆధునికీకరించి వసతి సౌకర్యాలు మెరుగుపర్చేందుకు కృషి చేస్తామన్నారు. మైనార్టీలకు అండగా నిలిచిన ఏకైక రాజకీయ పార్టీ బీఆర్ఎస్ అన్నారు. పలు మసీదుల మతపెద్దలు, ముస్లిం మైనార్టీ నాయకులు పద్మారావుకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కార్పొరేటర్లు సామల హేమ, సునీత, శైలజ, రామేశ్వర్, కిషోర్, కిరణ్, కరాటే రాజు, కందినారాయణ, బీఆర్ఎస్ సమన్వయకర్తలు జలంధర్ రెడ్డి, రాజుసుందర్ పాల్గొన్నారు.

- చిలకలగూడలో శుక్రవారం జరిగిన పలు కార్యక్రమాల్లో అడ్డగుట్టకు చెందిన ఎమ్మార్పీఎస్ నాయకుడు జోగు దశరథ్ నేతృత్వంలో పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు పద్మారావుకు మద్దతు ప్రకటించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో విద్యార్థులకు అండగా నిలిచిన పద్మారావుకు మద్దతు ప్రకటించి, ప్రచారంలో పాల్గొంటామని ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థుల వ్యవస్థాపక జేఏసీ అధ్యక్షుడు డాక్టర్ దత్తాత్రేయ స్పష్టం చేశారు. జేఏసీ నాయకులు కిషోర్, అనీల్, ప్రజాపతి, మనీష్, నవీన్, మహేందర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బెదిరింపులకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి

సనత్‌నగర్: ప్రజలను బెదిరింపులకు గురిచేస్తున్న బీఆర్ఎస్ నేతలపై చర్యలు తీసుకోవాలంటూ సనత్‌నగర్ బీజేపీ అభ్యర్థి మర్రి శశిధర్‌రెడ్డి గాంధీనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రచారం కోసం వెళ్లే ప్రాంతానికి ముందుగా ఆయన పీఏ చేరుకుని స్థానికంగా ఎలాంటి సమస్యలు ప్రస్తావించరాదని ప్రజలను బెదిరింపులకు గురిచేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గత రెండు వారాలుగా బీఆర్ఎస్ నేతల ప్రవర్తనతో నియోజకవర్గ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారన్నారు. ప్రధాన వ్యక్తులకు ఫోన్ చేసి బీజేపీకి మద్దతు తెలిపితే ఎన్నికల తర్వాత ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటారని బెదిరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ఆయన పేర్కొన్నారు.

Format C-I

(for candidate to publish in Newspapers, TV)

Declaration about criminal cases.

(As per the judgement dated 25th September, 2018, of Hon'ble Supreme Court in WP (Civil) No. 536 of 2011 (Public Interest Foundation & Ors. Vs. Union of India & Anr.)

Name and address of candidate : **MEKALA SARANGAPANI,** H.No.11-3-267/141, Madhura Nagar, Srinivas Nagar, Secunderabad 500061

Name of political party: **BHARATIYA JANATHA PARTY (B.J.P)**

Name of Election: **TELANGANA STATE LEGISLATIVE ASSEMBLY**

Name of Constituency: **(70) SECUNDERABAD**

I, MEKALA SARANGAPANI, (name of candidate) a candidate for the above mentioned election, declare for public information the following details about my criminal antecedents

(A) Pending criminal cases

Sl. No.	Name of Court	Case No. and dated	Status of case(s)	Section(s) of acts concerned and brief description of offence(s)
1	Hon'ble I Junior Civil Judge at Piler (Chittor Dist)	STC No 52 /2022	Examination	U/s 138 NI ACT Cheque Bounce Case
2	Hon'ble X Addl Chief Metropolitan Magistrate at Secunderabad.	CC No. 232/2021	Examination	U/s 143,341,269 r/w 49 IPC Wrongful Restraint Unlawful Assembly, not following covid 19 norms
3	Hon'ble X Addl Chief Metropolitan Magistrate at Secunderabad.	CC No. 3286/2019	Examination	U/S 290,143,341 r/w 149 IPC Public Nuisance, Unlawful Assembly, Wrongful Restraint
4	Hon'ble X Addl Chief Metropolitan Magistrate at Secunderabad.	CC No. 539/2019	Appearance	U/S 290,143,341 IPC Public Nuisance, Unlawful Assembly, Wrongful Restraint

(B) Details about cases of Conviction for criminal offences: - NIL-

Sl. No.	Name of Court & date(s) of order(s)	Description of Offence(s) & punishment Imposed	Maximum Punishment Imposed
NIL	NIL	NIL	NIL

Sd/- **MEKALA SARANGAPANI,**

MLA contesting Candidate, (70) SECUNDERABAD Candidate